క్లుప్తంగా

4న ఎమ్మెల్యే పర్యటన

చింతూరు: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఈనెల 4న చింతూరు మండలంలో పర్యటించనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపారు. పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఐటీడీఏలో దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేస్తారని, అనంతరం చట్టి ఆర్అండ్బీ గెస్ట్ హౌస్‌లో నాలుగు మండలాలకు చెందిన సచివాలయ కన్వీనర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం చట్టి సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో ఆధార్ సర్వే

కొయ్యూరు: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో లాలం సీతయ్య శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆధార్‌కార్డు లేని వారి వివరాలను సేకరించాలని సూచించారు. ఆయా వివరాల నివేదికను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. సచివాలయ సిబ్బంది వలంటీర్ల ద్వారా వెంటనే సర్వేను చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈవోపీఆర్డీ నాయుడు, ఏవో బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా మోహన్



కొయ్యూరు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా టి.వి.మోహన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన శ్రీనివాసరావుకు సమగ్ర శిక్ష అభియాన్ శాఖకు బదిలీ అయింది. ఈ మేరకు ఇక్కడ వైస్ ప్రిన్సిపాల్‌గా చేస్తున్న మోహన్‌కు ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలను మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

అడ్డతీగల: మండలంలోని పవనగిరి క్షేత్రంలో రుషిపీఠం కల్యాణ మండపంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో సామూహిక శ్రావణలక్ష్మీ పూజలు నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం సదానంద సరస్వతి స్వామి వారికి మహాగణపతి పూజ నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు.

సీపీఎం నేతల నిరసన

అరకులోయ రూరల్/ముంచంగిపుట్టు: పద్మాపురం, ముంచంగిపుట్టు ప్రాంతాల్లో సీపీఎం నేతలు శుక్రవారం నిరసన చేపట్టారు. పలువురు నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, విద్యుత్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నిత్యాసర ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాలదేవ్, హరి, మగ్గన్న, రామన్న, బుజ్జిబాబు, జయరాం పాల్గొన్నారు.

ఆండాళ్లమ్మకు తిరువీధి సేవ



తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. కొండ దిగువ ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆండాళ్లమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన చేశారు. తదుపరి స్వామివారికి, అండాళ్లమ్మవారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ప్రధానార్చకులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ముంగిటకే వైద్యం

- చురుగ్గా హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు
- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

నియోజకవర్గంలోని హెల్త్ క్లినిక్‌ల వివరాలు

మండలం	హెల్త్ క్లినిక్‌ల సంఖ్య
అనంతగిరి	14
అరకు	8
డుంబ్రిగుడ	13
హుకుంపేట	18
పెదబయలు	10
ముంచంగిపుట్టు	16



చిలకలగెడ్డలో నిర్మాణం పూర్తయిన హెల్త్ క్లినిక్

అనంతగిరి: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. గ్రామీణుల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో పలు కార్యక్రమాలకు శ్రీకారం చేపట్టారు. ఇందులో భాగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు నియోజకవర్గంలోని హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా, మిగిలిన గ్రామాల్లో భవనాల నిర్మాణానికి స్థల సేకరణ జరుగుతోంది. పనులు త్వరితగతిన పూర్తిచేసి, భవనాల అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

చెంతకే వైద్య సేవలు : ప్రభుత్వం పీహెచ్‌సీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. వైద్యం ఖర్చు రూ.1000 దాటితే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తోంది. 108, 104 వాహనాలను ప్రతి మండలానికి అందజేసింది. సచివాలయాల్లో ఏఎన్ఎంలను నియమించింది. తాజాగా ఏర్పాటు కానున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల తో వైద్య సేవలను పల్లెలకు మరింత చేరువకానున్నాయి. ప్రతి చిన్న వైద్యానికీ పట్టణాలకు వెళ్లాల్సిన పనిలేకుండా విలేజ్ క్లినిక్ ద్వారా 24 గంటలూ వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటుంది. ముఖ్యంగా 54 రకాల మందులు, అన్ని వేళలా క్లినిక్‌లు అందుబాటులోని రానున్నాయి. గర్భిణులకు నెలవారీగా వైద్య పరీక్షలు ఈ కేంద్రాల ద్వారానే అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఒక్కో హెల్త్ క్లినిక్‌కు రూ.20.80 లక్షలతో నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ భవన నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్యానికి ప్రాధాన్యం



గిరిజన ప్రాంతంలోని మరింత వైద్య సేవలను అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఈ మేరకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో చాలా సంతోషంగా ఉంది. వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో మెరుగైన వైద్య సేవలకు అందించేందుకు మంచి అవకాశం కలిగింది. ముఖ్యమంత్రి జగనన్నకు గిరిజనులంతా రుణపడి ఉంటాం.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

త్వరితగతిన పూర్తి చేస్తాం

వైఎస్సార్‌హెల్త్ క్లినిక్ సెంటర్లు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించాం. చిలకలగెడ్డలో హెల్త్ క్లినిక్ అందుబాటులోకి తీసుకొచ్చాం.మిగిలిన ప్రాంతాల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

– సాయివిజయ్, ఏఈ, పీఆర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కితలంగి పంచాయతీ వయ్యా, పరిశీల గ్రామా ల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామా ల్లో 255 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి, ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సంపంగి గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.4కోట్లు మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, సర్పంచ్ సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు దేవి, నాయకులు శ్రీరాములు, కృష్ణారావు, సింహాచలం, గణపతి, చిరంజీవి, మల్లేష్, అశోక్‌కుమార్, బాలరాజు, సీడీపీవో నీలిమ పాల్గొన్నారు.

స్తంభించిన నెట్‌వర్క్.. నిలిచిన ఆన్‌లైన్ సేవలు

రాజవొమ్మంగి: లోదొడ్డి సచివాలయంలో ఫైబర్ నెట్‌వర్క్ సేవలు స్తంభించడంతో పనుల నిర్వహణకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ రామారావు చెప్పారు.
ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో పలువురు ఆందోళన చేసినట్టు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నెట్‌వర్క్ స్తంభించడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల అప్‌లోడ్ పనులు నిలిచిపోతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో-2 మల్లేశ్వరరావు

గంగవరం: స్థానిక లూథరన్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-2 మల్లేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట హెచ్ఎం టి.జీ వితేశ్వరి ఉన్నారు.

హౌసింగ్ ఏఈగా గౌరీశంకర్



హుకుంపేట: మండలంలోని హౌసింగ్ ఏఈగా ఎం.గౌరీశంకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని హౌసింగ్ శాఖలో గతంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయనకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తు హుకుంపేట మండలంలోనే హౌసింగ్ ఏఈగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సక్రమంగా విధులు నిర్వహిస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మండలంలో 582 గృహాలు మంజూరయ్యాయని, వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. మండలంలోని ఇళ్ల పట్టాలు కలిగిన 3,400మందికి గృహాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే నిర్మాణాలు చేయనున్నట్టు తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

సీడీపీవో విజయగౌరి



మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి

చింతూరు: పౌష్టికాహారం విషయంలో గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించాలని సీడీపీవో విజయగౌరి అన్నారు. స్థానిక ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవరం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో మాట్లాడుతూ మునగాకు చాలా విలువైన పోషకాలు కలిగి ఉంటుందని, దీనిని ప్రతి కూరలో ఉండే విధంగా గర్భిణులు చూసుకోవాలన్నారు. ఆహారం విషయంలో అశ్రద్ధ చేయకుండా సమయానికి ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. సూపర్‌వైజర్ సంఘమిత్ర, ప్రియాంక, సత్యవతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై రైతులకు సూచనలు



పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సత్యాదేవి

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేటలో మండల వ్యవసాయాధికారి ఎం.సత్యాదేవి ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ సాగుపై దృష్టి సారించాలన్నారు. గ్రామంలోని కాలచర్ల రవికి చెందిన వరి పొలంలో ప్రకృతి సాగుకు చెందిన పలు అంశాలపై క్షేత్రస్థాయి సూచనలిచ్చారు. వరి పొలంలో మిత్ర పురుగులు, శత్రు పురుగులపై అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు ప్రకృతి కషాయాల తయారీని వివరించారు. పొలం గట్లపై కలుపు లేకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు, వీఏఏ, వీహెచ్ఎలు అరవింద్, రేవంత్, భవాని, షర్మిల, మౌనిక, అమ్మాజీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో కుంకుమార్చనలు



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



లక్ష పుష్పాలతో మహిళా భక్తుల ప్రదక్షిణలు

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక ఆలయంలో శ్రావణమాస మూడో శుక్రవారం పురస్కరించుకుని ఆలయ మండపంలో కుంకుమార్చనలు జరిగాయి. ఆలయానికి నూతనంగా నియమితులైన పాలక మండలి సభ్యుల తోపాటు అధికసంఖ్యలో మహిళా భక్తులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సభ్యులు కంటపల్లి శోభారాణి, పీలా లక్ష్మీ శ్రీనివాసరావు, పాము అనురాధ, మళ్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమా చంద్రమహేశ్వరి, బుద్ద నరసింగరావు, నరసింగరావు, కొండూరు రవీంద్ర, ఆలయ ఈవో ప్రసాద్ పూజల్లో పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరికి స్వీట్లతో అలంకరణ

గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరి అమ్మవారిని పలు రకాల మిఠాయిలతో అలంకరించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు గోపాలకృష్ణ శర్మ, శేషు ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన నిర్వహించారు. ఆలయం చుట్టూ లక్ష పుష్పాలతో మహిళాభక్తులు ప్రదక్షిణలు చేసి, పూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సన్యాసినాయుడు, రమణాజీ, సూర్యనారాయణ, సభ్యులు లక్ష్మీనర్సింగరావు, బాలకృష్ణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



అరకులోయలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుస్మిత, నాయకులు



దముకులాడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్



కన్నాయిగూడెంలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ నాగమణి

అరకులోయ రూరల్: మండలంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పింఛన్లను సర్పంచ్ పెట్టేలి సుస్మిత శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అర్హులైన వారందరికీ పింఛన్ల మంజూరు చేస్తోందన్నారు. ప్రతి నెల కొత్త పింఛన్‌దారుల సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రభుత్వం నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలతో పాటు పింఛన్ల అందజేసి అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. పద్మాపురం మేజర్ పంచాయతీలో ఈనెల నలుగురికి కొత్త పింఛ న్లు మంజూరైనట్టు చెప్పారు. వైస్ సర్పంచ్ భగత్‌రాం, సచివాలయం కన్వీనర్ యాసీన్, నాయకులు సుంద్ర, గృహసారథులు కృష్ణవేణి, రాజేశ్వరి, వార్డు సభ్యుడు రవి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని బాబుశాల పంచాయతీ డముకులాడి, మొండిగుమ్మ, ఏడుకొండల బంధ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ శుక్రవారం పర్యటించి, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తోందని, గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. నాయకులు కృష్ణ, గణేష్, వలంటీర్లు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో కొత్తగా 250 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను ఈవోపీఆర్డీ శ్రీనివాస్ శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 9,449 మందికి పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. పెదబరడ పంచాయతీలో 21 మందికి కొత్త పింఛన్లు అందజేశామన్నారు.

ఎటపాక: మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో కొత్తగా 141 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను ప్రజాప్రతినిధులు శుక్రవారం పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆధార్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లిరూరల్: గిరిజనులందరూ తప్పనిసరిగా ఆధార్ నమోదు చేసుకోవాలని ఎంపీడీవో ఆశాజ్యోతి చెప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆధార్ నమోదు చేసుకొని 10 సంవత్సరాలు దాటిన వారు తప్పనిసరిగా మరలాబయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈవోపిఆర్డీ శ్రీనివాస్ తదితరులున్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



యువతకు వాలీబాల్ కిట్లను అందజేస్తున్న ఎస్ఐలు సంతోష్‌కుమార్, లోకేష్‌కుమార్

కొయ్యూరు/వై.రామవరం: జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొయ్యూరు మండలం యు.చీడిపాలెం పంచాయతీలో తీగలమెట్ట, గొల్లల బంద, నీలవరం, గంగవరం, తాళ్ల యర్రగొండ, వై.రామవరం మండలం దద్దిలికివాడ, బురదకోట గ్రామాల్లో ఎస్ఐలు లోకేష్‌కుమార్, ఎం.సంతోష్‌కుమార్‌లు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, మావోయిస్టు కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మావోయిస్టులకు సహకరించొద్దన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని , వాటికి దూరంగా ఉండాలని సూచించారు. గిరిజన యువతకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరిజనులు మూఢనమ్మకాలు వీడాలని, నాటువైద్యం ఆశ్రయించొద్దన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత బాగా చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో యువతకు వాలీబాల్ కిట్‌లను, చిన్నారులకు చాక్లెట్లు అందజేశారు. ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

శ్రావణ పౌర్ణమి సామూహిక హారతి



సామూహిక హారతి ఇస్తున్న మహిళలు

కోటవురట్ల / కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని గురువారం అర్ధ రాత్రి వరకు సత్సంగం, సామూహిక హారతి కార్యక్రమాలను నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హారతి వెలిగించారు. హిందూ ధర్మం గురించి ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ నక్కా సత్య నారాయణ భక్తులకు వివరించారు. మండల కన్వీనర్ మందపల్లి శివ, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాల స్వర్ణోత్సవాలపై ప్రచారం



పాఠశాల స్వర్ణోత్సవాల కార్యక్రమంపై ప్రచారం చేస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న స్వర్ణోత్సవాలపై పూర్వ విద్యార్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పాఠశాల స్వర్ణోత్సవాలను నవంబర్ 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పాఠశాలలో 1963 నుంచి 2023 వరకు చదివిన, చదువుతున్న విద్యార్థులను కార్యక్రమాలకు ఆహ్వానించేందుకు స్వర్ణోత్సవాల కమిటీ సభ్యులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు

అచ్యుతాపురం(అనకాపల్లి): చిరుధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, చిరు ధాన్యాలతో పలు రకాల వంటలు చేయవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.ప్రసాదరావు తెలిపారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ట్రైనర్ లక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.సేంద్రియ పద్ధతుల ద్వారా పండించే పంటల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.10 గ్రామాలకు చెందిన రైతులకు చిరుధాన్యాలపై నిర్వహించిన సదస్సులో ఏషియన్ పెయింట్స్ హెచ్ఆర్ ఉదయ్, చందన గౌతం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధ్యాన మహాచక్రం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లి శ్రీధ్యానాశ్రయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీగిజా పిరమిడ్ శ్రీ ధ్యాన మహా చక్రం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ధ్యానం ప్రాధాన్యత గురించి వివరించారు.